సాక్షి
రాజన్న సిరిసిల్ల
శుక్రవారం । 24 । ఫిబ్రవరి । 2023



గోశాలకు కోడెలు

వేములవాడఅర్బన్‌: రాజన్నకు చెందిన 20 కోడెలను వరంగల్‌ జిల్లా గీసుకొండ మండలం అనంతరంలోని హనుమాన్‌ గోశాలకు గురువారం అందజేశారు.



నృసింహునికి పూజలు

ధర్మపురి : శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో గురువారం భక్తుల రద్దీ నెలకొంది. స్వామివారిని దర్శించుకున్న భక్తులు పూజలు చేశారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
35.0/18.0

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. పగలు ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చల్లగాలులు వీస్తాయి. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్‌

రాజన్న సన్నిధిలో లా సెక్రటరీ పూజలు



రాజన్న ప్రసాదం అందజేస్తున్న ఆలయ అధికారులు

వేములవాడ: రాజన్నను రాష్ట్ర లా సెక్రటరీ నందికొండ నర్సింగారావు గురువారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించారు. పర్యవేక్షకులు అల్లి శంకర్‌, అర్చకులు వేదోక్త ఆశీర్వచనం ఇచ్చారు. రాజన్న ప్రసాదం అందజేశారు. వారి వెంట సబ్‌ జడ్జి సత్తు రవీందర్‌, జూనియర్‌ సివిల్‌ జడ్జి ప్రతీక్‌సిహాగ్‌ ఉన్నారు.

సమస్యలు పరిష్కరించండి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

సిరిసిల్లటౌన్‌: అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం జిల్లా సంక్షేమాధికారి ఆఫీస్‌లో వినతిపత్రం అందించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. ప్రభుత్వ టీచర్లతో సమానంగా అంగన్‌వాడీ టీచర్లకు వేతనాలు ఇవ్వాలని, పీఎఫ్‌, ఈఎస్‌ఐ సౌకర్యాలు కల్పించాలని కోరారు. అంగన్‌వాడీలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. మార్చి 1 నుంచి 3వ తేదీ వరకు సమ్మె చేపట్టనున్నట్లు తెలిపారు. దేవదాసు తదితరులు ఉన్నారు.

అర్చకులకు అభినందనలు




అర్చకులను అభినందిస్తున్న ఈవో

వేములవాడ: తుంగానది తీరంలోని శృంగేరి భవాని ఆలయంలో నిర్వహించిన మహాకుంభాభిషేకంలో పాల్గొన్న రాజన్న ఆలయ అర్చకులను ఈవో కృష్ణప్రసాద్‌ సన్మానించారు. ఈనెల 7 నుంచి 21వ తేదీ వరకు జరిగిన మహాకుంభాభిషేకంలో అప్పాల రాజచంద్రశర్మ, గోపన్నగారి గణేశ్‌, కేశన్నగారి కృపాల్‌ పాల్గొన్నారు. వీరికి, ఆలయ ఈవోకు శృంగేరి పీఠాధిపతులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో గురువారం ముగ్గురు అర్చకులను సన్మానించారు.

కుక్కల బెడద నుంచి కాపాడండి

వేములవాడ: వేములవాడలోని 10వ వార్డులో కుక్కలు గుంపులు తిరుగుతూ చిన్నారులపై దాడులు చేస్తున్నాయని పేర్కొంటూ ఆ కాలనీవాసులు గురువారం మున్సిపల్‌ కమిషనర్‌ అన్వేశ్‌కు వినతిపత్రం అందించారు. చిన్నారులు స్కూళ్లకు వెళ్లాలంటేనే భయపడిపోతున్నారని, వృద్ధులు బయటకు వెళ్లేందుకు జంకుతున్నారని పేర్కొన్నారు. కుక్కల బెడద నుంచి రక్షణ కల్పించాలని వేడుకున్నారు. రాత్రి వేళ నడుచుకుంటే వెళ్తే వెంటపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో చాలా మందిని కుక్కలు కరిచాయన్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకవర్గం స్పందించి కుక్కల బెడద తొలగిపోయేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

'డబుల్‌' ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు

సిరిసిల్లఅర్బన్‌: తంగళ్లపల్లి మండలం వేణుగోపాల్‌పూర్‌లో డబుల్‌ బెడ్‌రూమ్‌ ఇళ్ల నిర్మాణానికి గురువారం ప్రజాప్రతినిధులు భూమి పూజ చేశారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్‌ నిరుపేదల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నారన్నారు. ఇందులో భాగంగానే ఇళ్లు లేని నిరుపేదలకు డబుల్‌ బెడ్‌రూమ్‌ ఇళ్లను నిర్మించి ఇస్తుందన్నారు. త్వరలోనే పనులు మొదలవుతాయన్నారు. వైస్‌ ఎంపీపీ జంగిటి అంజయ్య, సర్పంచ్‌ కాయితి బాలయ్య, లబ్ధిదారులు ఉన్నారు.

ట్రా'ఫికర్‌'

- జిల్లాలో పెరిగిన వాహనాల రద్దీ
- విస్తరణ లేని రహదారులు
- కనిపించని పార్కింగ్‌ స్థలాలు
- సిరిసిల్ల, వేములవాడల్లో ట్రాఫిక్‌ తిప్పలు
- పార్కింగ్‌ స్థలం లేక పరేషాన్‌
- జరిమానాలతో బెంబేలు

సిరిసిల్లక్రైం: రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంగా ఆవిర్భవించిన తర్వాత సిరిసిల్లలో వాహనాల రద్దీ తీవ్రంగా పెరిగింది. వివిధ పనులపై జిల్లా కేంద్రానికి వచ్చే వారి సంఖ్య పెరగడంతో వాహనాల రద్దీ పెరిగి ట్రాఫిక్‌ జామ్‌ అవుతుంది. ఆధ్యాత్మిక క్షేత్రం వేములవాడ పట్టణం జిల్లా కేంద్రానికి సమీపంలో ఉండడంతో భక్తుల వాహనాల రద్దీతో ట్రాఫిక్‌ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. వేములవాడ పట్టణంలో రోడ్లు చిన్నగా ఉండడంతో ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోతుండడంతో స్థానికులతోపాటు భక్తులు ఇబ్బందులు పడుతున్నారు.



సిరిసిల్లలో వాహనాల రద్దీ

జిల్లాలో వాహనాలు ఇలా..

బైక్స్‌	90,445
మోటార్‌క్యాబ్స్‌	835
ట్రాక్టర్స్‌	9,842
గూడ్స్‌ క్యారియర్స్‌	4,342
ఆటోలు	3,943
అంబులెన్స్‌లు	35



వాహనాల తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ రాజుకుమార్‌

చావు'రస్తాలు'

జిల్లా కేంద్రానికి ప్రధాన రహదారి కరీంనగర్‌–కామారెడ్డి మార్గంలో ప్రమాదకర చౌరస్తాలు ఉన్నాయి. కలెక్టరేట్‌ ముందు ఉన్న చౌరస్తా ఇప్పటికీ నిర్మాణం పూర్తికాలేదు. వాహనాలు ఎక్కడి నుంచి ఎటు వెళ్లాలో అర్థంకాక వాహనదారులు ఇష్టారీతిగా ప్రయాణిస్తున్నారు. చంద్రంపేట వద్ద ఉన్న జంక్షన్‌ ప్రమాదకరంగా ఉంది. ఇక్కడ ఇప్పటికే పదుల సంఖ్యలో ప్రమాదాలు జరిగాయి. వేములవాడలో తిప్పాపూర్‌ బస్టాండ్‌ ఏరియాలోనూ వాహనంపై వెళ్లాలంటే భయం.. భయంగా నడపాల్సిందే. ఇక్కడ ఏ వాహనం సిరిసిల్లకు వెళ్తుందో.. కరీంనగర్‌ వెళ్తుందో తెలియక తికమక పడుతున్నారు. వేములవాడ ప్రారంభంలో ఉన్న నంది కమాన్‌ వద్ద చౌరస్తాలో వాహనాలు ఎటు నుంచి వెళ్లాలనే నిబంధనలు లేవు. మహాశివరాత్రి సమయంలో తప్ప వాహనాల రాకపోకలను దారి చూపే గుర్తులు ఉండవని స్థానికుల నుంచి విమర్శలు ఉన్నాయి.

విధుల్లోకి ట్రాఫిక్‌ ఎస్సైలు

సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో ట్రాఫిక్‌ సమస్య పరిష్కారానికి ఇప్పటికే పలు విధానాలను అమలు చేస్తున్నారు. ఇద్దరు ట్రాఫిక్‌ ఎస్సైలను విధుల్లోకి తీసుకున్నారు. రోడ్డు నిబంధనలు పాటించేలా పలు అవగాహన చర్యలు తీసుకుంటున్నారు. నిబంధనలు అతిక్రమించిన వారికి జరిమానాలు విధిస్తున్నారు. ట్రాఫిక్‌ సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేకంగా ట్రాఫిక్‌ స్టేషన్‌లను త్వరలోనే ఏర్పాటు చేయనున్నట్లు తెలిసింది. ఇప్పటికే సిరిసిల్ల నేతన్న చౌరస్తా వద్ద ట్రాఫిక్‌ సిగ్నల్స్‌ అమర్చారు. వీటిని మహాశివరాత్రి అనంతరం ప్రారంభించనున్నట్లు సమాచారం.

విస్తరణకు నోచుకోని రోడ్లు

జిల్లా కేంద్రం సిరిసిల్లలో పార్కింగ్‌స్థలాలు అందుబాటులోకి రాలేదు. వివిధ పనుల మీద సిరిసిల్లకు వచ్చే వారి వాహనాలు నిలిపేందుకు స్థలం కరువైంది. దీంతో వాహనదారులు రోడ్డుకు ఇరువైపులా వాహనాలను నిలుపుతున్నారు. వేములవాడ దర్శనార్థం వచ్చే భక్తులను గుడి చెరువు ప్రాంతంలో తప్ప మరో ప్రాంతంలో పార్కింగ్‌ స్థలాలు లేవు. ఇలాంటి పరిస్థితిలో వాహనాలను నిలిపితే జరిమానాలు విధిస్తున్నారని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. రోడ్డు పక్కన పార్కింగ్‌ చేసిన వాహనాలకు కొన్ని తగులుతూ వెళ్తుండడంతో పాడవుతున్నాయి. పార్కింగ్‌ స్థలాలు చూపకుండా జరిమానాలు వేయడం సరికాదని వాహనదారులు పేర్కొంటున్నారు. పోలీస్‌, మున్సిపల్‌ అధికారులు సమన్వయంతో ముందుకెళ్తే సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో ట్రాఫిక్‌ సమస్యకు పరిష్కారం లభించనుంది.

ట్రాఫిక్‌ నియంత్రణపై దృష్టి



విధుల్లో చేరినప్పటి నుంచి అన్ని మండలాల్లోని ఠాణాలను సందర్శించాను. ట్రాఫిక్‌ నియంత్రణలో ఇప్పటికే అధికారులు పనిచేస్తున్నారు. నేను కూడా ట్రాఫిక్‌ నియంత్రణపై వాకబు చేస్తాను. వాహనదారులకు ప్రయాణంలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటాను. సంబంధిత అధికారులతో చర్చించి తగు చర్యలు తీసుకుంటాను.

– అఖిల్‌ మహాజన్‌, ఎస్పీ, సిరిసిల్ల

సీపీఐ శ్రేణుల్లో జోష్‌

- అల్గునూర్‌ నుంచి బైక్‌ ర్యాలీ



వేదికపై అభివాదం చేస్తున్న సీపీఐ నాయకులు

కరీంనగర్‌: సీపీఐ ఉమ్మడి జిల్లా జనరల్‌ బాడీ సమావేశం సందర్భంగా గురువారం జిల్లా కేంద్రానికి తొలిసారిగా వచ్చిన కూనంనేని సాంబశివరావుకు సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఎర్ర చొక్కాలు ధరించి కార్యకర్తలు ర్యాలీలో పాల్గొన్నారు. తిమ్మాపూర్‌ మండలం గుండ్లపల్లి, రేణికుంట, నుస్తులాపూర్‌, అల్గునూర్‌ చౌరస్తాల్లో సీపీఐ కార్యకర్తలు రాష్ట్ర కార్యదర్శి కూనంనేనికి, పార్టీ జాతీయ నాయకుడు చాడ వెంకట్‌రెడ్డికి జిల్లా పార్టీ ఆధ్వర్యంలో భారీ స్వాగత ఏర్పాట్లు చేశారు. అల్గునూర్‌ నుంచి ఓపెన్‌ టాప్‌ జీప్‌లో కూనంనేనితోపాటు చాడ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్‌ వచ్చారు. కమాన్‌ చౌరస్తా వద్ద మహిళలు, డప్పు కళాకారులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఉమ్మడి జిల్లా జనరల్‌ బాడీ సమావేశం జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి అధ్యక్షతన రెవెన్యూ గార్డెన్‌లో నిర్వహించారు. రాష్ట్ర నాయకులను జిల్లా పార్టీ పక్షాన గజమాలలతో సత్కరించారు. కూనంనేని సాంబశివరావు, చాడ మాట్లాడుతూ ఓట్లు, సీట్లు, అధికారం కోసం ఎర్ర జెండా పుట్ట లేదని, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పోరాటాలు నిర్వహిస్తామని చెప్పారు. సమావేశంలో కరీంనగర్‌, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల కార్యదర్శులు మర్రి వెంకటస్వామి, తాండ్ర సదానందం, గుంటి వేణు, వెన్న సురేశ్‌, రాష్ట్ర కౌన్సిల్‌ సభ్యులు పొనగంటి కేదారి, గోశిక మోహన్‌, పల్లె నర్సింహా, జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్‌ కుమార్‌, బోయిని అశోక్‌, అందె స్వామి, గూడెం లక్ష్మి, కసిరెడ్డి సురేందర్‌ రెడ్డి, టేకుమల్ల సమ్మయ్య, బత్తుల బాబు, బండ రాజిరెడ్డి, జిల్లా కౌన్సిల్‌ సభ్యులు నాగెల్లి లక్ష్మారెడ్డి, బోయిని తిరుపతి, కిన్నెర మల్లవ్వ, బీర్ల పద్మ, పైడిపెల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

అదానీ వ్యవహారంపై ప్రధాని మాట్లాడాలి

- డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్‌



మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్‌

సిరిసిల్లటౌన్‌: దేశ వ్యాప్తంగా అదానీ వ్యవహారంపై నిరసనలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ప్రధాని నరేంద్రమోదీ నోరు విప్పాలని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్‌ కోరారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అదానీ గ్రూప్‌లో ఆర్థిక అవకతవకలు జరిగాయని హిడెన్‌బర్గ్‌ ఇచ్చిన నివేదికపై ప్రధాని ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. అదానీ వ్యవహారంపై విచారణ జరిపించాలన్నారు. మోదీ ప్రోద్బలంతోనే అదానీ కంపెనీలో పెట్టుబడులు పెట్టి ఎల్‌ఐసీ, ఎస్‌బీఐ సంస్థలు నష్టపోయాయన్నారు. కేంద్ర ప్రభుత్వం తొమ్మిదేళ్లుగా కాగ్‌, సీబీఐలను నియంత్రిస్తోందన్నారు. పార్లమెంట్‌లో రాహుల్‌గాంధీ, కాంగ్రెస్‌ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రసంగాలను ప్రభుత్వం తప్పుదోవ పట్టిస్తుందన్నారు. ప్రతిపక్షాల గొంతు నొక్కడం అప్రజాస్వామికమని, దేశంలో పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, ప్రజల సమస్యలపై కాంగ్రెస్‌ నిరంతరం పోరాడుతుందన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హాథ్‌ సే హాథ్‌ జోడో పాదయాత్ర మార్చి 4, 5 తేదీల్లో సిరిసిల్ల, వేములవాడలో ఉంటుందని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు సత్యనారాయణగౌడ్‌, ఆకునూరి బాలరాజ్‌, పట్టణ అధ్యక్షుడు సంగీతం శ్రీని వాస్‌, బ్లాక్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు సూర దేవరాజు, చొప్పదండి ప్రకాష్‌, ప్రశాంత్‌గౌడ్‌, వంగ మల్లేశం, రామస్వామి, నర్సయ్య తదితరులు ఉన్నారు.

కేసులు ఎత్తివేయాలి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): న్యాయం కోసం పోలీసులతో వాగ్వాదానికి దిగిన ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగుండారంకు చెందిన భూక్య రాజునాయక్‌తోపాటు మరో ఏడుగురిపై నమోదు చేసిన కేసులను వెంటనే ఎత్తివేయాలని కాంగ్రెస్‌ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్‌ డిమాండ్‌ చేశారు. గురువారం రాచర్లగుండారంలో రాజునాయక్‌ను పరామర్శించారు. ఆర్‌ఎంపీ ఇచ్చిన ఇంజక్షన్‌ వికటించి ఓ వ్యక్తి మరణించిన ఘటనలో న్యాయం కావాలని సామాజిక సేవ కోసం వెళ్లిన రాజునాయక్‌పై కేసు నమోదు చేయడం అన్యాయం అన్నారు. ఆయన వెంట నాయకులు దోమ్మాటి నర్సయ్య, లింగం, మానుక నాగరాజు, రాంరెడ్డి, దేవయ్య, రవి, రాజేందర్‌ తదితరులున్నారు.

ఆధార్‌సీడింగ్‌ వందశాతం పూర్తి చేయాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్‌ ఖీమ్యానాయక్‌

- అదనపు కలెక్టర్‌ ఖీమ్యానాయక్‌

సిరిసిల్లఅర్బన్‌: ఓటరు గుర్తింపుకార్డుల ఆధార్‌సీడింగ్‌ పూర్తి చేయాలని అదనపు కలెక్టర్‌ ఖీమ్యానాయక్‌ రెవెన్యూ అధికారులను ఆదేశించా రు. కలెక్టరేట్‌లో గురువారం ఓటర్‌కార్డులకు ఆధార్‌ అనుసంధానంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్‌ మాట్లాడుతూ జిల్లాలో 78.74 శాతం ఓటర్‌కార్డులకు ఆధార్‌ అనుసంధానం చేశారని, మిగతా వాటికి త్వరగా పూర్తి చేయాలన్నారు. ఎలక్షన్‌ పర్యవేక్షకులు రెహమాన్‌, తహసీల్దార్‌లు వి జయ్‌కుమార్‌, రాజు, ఎలక్షన్‌ డీటీలు శ్రవణ్‌, మురళీ ఉన్నారు.

'డబుల్‌' ఇళ్లను సిద్ధం చేయండి

- కలెక్టర్‌ అనురాగ్‌ జయంతి
- జిల్లా అధికారులతో సమీక్ష



డబుల్‌ బెడ్‌రూమ్‌ ఇళ్ల నిర్మాణ పనులపై ఆరా తీస్తున్న కలెక్టర్‌ అనురాగ్‌ జయంతి

సిరిసిల్లఅర్బన్‌: మార్చి 15వ తేదీలోగా డబుల్‌ బెడ్‌రూమ్‌ ఇళ్లను పంపిణీకి సిద్ధం చేయాలని కలెక్టర్‌ అనురాగ్‌ జయంతి ఆదేశించారు. సిరిసిల్ల మున్సిపల్‌ పరిధిలోని రగుడు, శాంతినగర్‌, పెద్దూరులలో నిర్మాణంలో ఉన్న డబుల్‌ బెడ్‌రూమ్‌ ఇళ్ల సముదాయాలను అదనపు కలెక్టర్‌ ఖీమ్యానాయక్‌, మున్సిపల్‌, ఆర్‌అండ్‌బీ అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. కలెక్టర్‌ మాట్లాడుతూ నిర్మాణాలు పూర్తయిన చోట విద్యుత్‌దీకరణ, శానిటరీ, డ్రెయినేజీలు, రోడ్లు, సీవరేజ్‌ సెప్టిక్‌ ట్యాంక్‌ తదితర నిర్మాణాలపై దృష్టి పెట్టి పనులను తొందరగా పూర్తి చేయాలన్నారు. డబుల్‌ బెడ్‌రూమ్‌ కాలనీల్లో ఆరోగ్య ఉపకేంద్రం, అంగన్‌వాడీ కేంద్రాలకు అనువైన భవనాలను గుర్తించాలన్నారు. కాలనీకి వెళ్లే మార్గాలు, అంతర్గత రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటాలని సూచించారు. ప్రతీవారం ఇళ్ల ప్రగతిని పరిశీలించాలని అదనపు కలెక్టర్‌ ఖీమ్యానాయక్‌కు సూచించారు.

మైదానం పనులు పూర్తి చేయాలి

సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాల మైదానంలోని గ్రౌండ్‌ అభివృద్ధి పనులను కలెక్టర్‌ పరిశీలించారు. గ్రౌండ్‌కి వచ్చే అన్ని గేట్ల ప్రవేశమార్గాలను అందంగా తీర్చిదిద్దాలని సూచించారు. కబడ్డీ, క్రికెట్‌, వాలీబాల్‌ కోర్టులను అభివృద్ధి చేయాలని, హైమాస్ట్‌ లైట్లు ఏర్పాటు చేయాలన్నారు.

రేషన్‌ సరుకులను సకాలంలో అందించాలి

స్థానిక ప్రగతినగర్‌లోని చౌకధరల దుకాణాన్ని కలెక్టర్‌ తనిఖీ చేశారు. స్టాక్‌ రిజిస్టర్‌, స్టాక్‌ తెలిపే బోర్డులు, బయోమెట్రిక్‌ ఈ–పాస్‌ యంత్రాలను పరిశీలించారు. లబ్ధిదారులకు సకాలంలో రేషన్‌ సరుకులు అందించాలని సూచించారు. డీఎస్‌వో జితేందర్‌రెడ్డి, తహసీల్దార్‌ విజయ్‌కుమార్‌, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ సంతోష్‌, డీలర్‌ విజయ, కమిషనర్‌ సమ్మయ్య, ఆర్‌అండ్‌బీ ఈఈ శ్యామ్‌సుందర్‌, ఏఈ భాస్కర్‌ ఉన్నారు.

వేములవాడ అభివృద్ధి పనులను పూర్తిచేయాలి

వేములవాడలో ప్రగతిలో ఉన్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్‌ అనురాగ్‌ జయంతి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో వేములవాడ అభివృద్ధి, ఆలయ అభివృద్ధి పనుల పురోగతిపై సంబంధిత శాఖ అధికారులతో గురువారం సమీక్షించారు. శామకుంట వెజ్‌మార్కెట్‌ నిర్మాణం పూర్తయినందున రంగులు వేయాలని సూచించారు. ఇంటిగ్రేటెడ్‌ మార్కెట్‌ను మే నెలాఖరులోగా పూర్తి చేయాలని సూచించారు. నందికమాన్‌ నుంచి తిప్పాపూర్‌ బస్టాండ్‌ వరకు ఫుట్‌పాత్‌ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా టౌన్‌ప్లానింగ్‌ అధికారికి సూచించారు. స్టేడియం, సినారె కళామందిరం, మూలవాగు పనులను పూర్తిచేయాలన్నారు. బద్దిపోచమ్మ ఆలయ భూసేకరణ పూర్తిచేసి ఆలయాన్ని అభివృద్ధి చేయాలన్నారు. అదనపు కలెక్టర్‌ సత్యప్రసాద్‌, ఆలయ ఈవో కృష్ణప్రసాద్‌, ఆర్‌అండ్‌బీ ఈఈ శ్యామ్‌సుందర్‌, పంచాయతీరాజ్‌ ఇంజినీర్‌ సూర్యప్రకాశ్‌, ఇరిగేషన్‌ ఈఈ అమరేందర్‌ రెడ్డి, ఈఈ శ్రీనివాస్‌, పబ్లిక్‌ హెల్త్‌ ఈఈ సంపత్‌, మున్సిపల్‌ కమిషనర్‌ అన్వేశ్‌, డీఎంహెచ్‌వో సుమన్‌మోహన్‌రావు, టౌన్‌ప్లానింగ్‌ అధికారి అన్సారీ, వీటీడీఏ ఎస్టేట్‌ అధికారి సత్యనారాయణ ఉన్నారు.

క్రెచ్‌ ఏర్పాటుపై కేటీఆర్‌ ప్రశంస



సిరిసిల్లకల్చరల్‌: కలెక్టరేట్‌లోని వివిధ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగినుల పిల్లల కోసం క్రెచ్‌(పిల్లల సంరక్షణ కేంద్రం) ఏర్పాటుపై రాష్ట్ర ఐటీ మంత్రి కేటీఆర్‌ స్పందించారు. పిల్లల కోసం రూపొందించిన క్రెచ్‌లో ఏర్పాటు చేసిన సౌకర్యాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రేట్‌ జాబ్‌ అంటూ ట్విట్టర్‌లో కలెక్టర్‌ అనురాగ్‌ జయంతిని అభినందించారు.

25న మినీ జాబ్‌మేళా

సిరిసిల్లకల్చరల్‌: సుధీర ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్‌ ప్రైవేట్‌ కంపెనీలో సేల్స్‌, మార్కెటింగ్‌ విభాగాల్లో ఉద్యోగాల భర్తీ కోసం ఈనెల 25న మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి నీల రాఘవేందర్‌ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల నిరుద్యోగ యువత నర్సింగ్‌ కళాశాల పక్కన గల అంబేడ్కర్‌ భవన్‌లో నిర్వహించే మేళాకు విద్యార్హత సర్టిఫికెట్లతో ఉదయం 11 గంటలకు హాజరు కావాలని కోరారు.

శివరాత్రి బందోబస్తు భేష్‌



నేరాల నియంత్రణపై సమీక్షిస్తున్న ఎస్పీ అఖిల్‌ మహాజన్‌

- ఎస్పీ అఖిల్‌మహాజన్‌ అభినందనలు
- నేర ఛేదనకు సాంకేతిక పరిజ్ఞానం వాడాలి

సిరిసిల్లక్రైం: రాజన్న ఆలయంలో మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించిన శివరాత్రి ఉత్సవాలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంతంగా ముగిసేలా కృషి చేసినందుకు జిల్లా పోలీస్‌ అధికారులు, సిబ్బందిని ఎస్పీ అఖిల్‌మహాజన్‌ అభినందించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిస్థితులు, పెండింగ్‌ కేసులపై గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్‌మహాజన్‌ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్‌ అధికారులు పకడ్బందీగా వ్యవహరించాలని సూచించారు. నేరాలు జరిగేందుకు ఆస్కారం ఉన్న అనుమానిత ప్రాంతాల్లో ఎక్కువ సమయం గస్తీ నిర్వహించాలని సూచించారు. పెండింగ్‌ కేసులను త్వరగా పరిష్కరించాలన్నారు. పెండింగ్‌ కేసుల సంఖ్యను తగ్గించేలా చూడాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసులలో విచారణ వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. కోర్టు జారీచేసిన నాన్‌ బెయిలబుల్‌ వారెంట్లను నిందితులపై, తప్పించుకుని తిరుగుతున్న వారిపై అమలుకు అధికారులు, సిబ్బంది కృషిచేయాలని ఆదేశించారు. పోలీస్‌స్టేషన్‌ వచ్చే బాధిత ప్రజలపై మానవీయ కోణంలో స్పందించి సమస్య పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వివిధ సమస్యలను చెప్పుకునేందుకు ఠాణాలకువచ్చే వారితో మర్యాదగా ప్రవర్తించాలన్నారు. గ్రామాల్లో ప్రజలతో మమేకమవుతూ నేరాలను నియంత్రించాలన్నారు. 17 ఫంక్షనల్‌ వర్టికల్స్‌ అమలు చేయాలని సూచించారు. ఫంక్షనల్‌ వర్టికల్స్‌లో అత్యుత్తమ విధులు నిర్వర్తించిన 26 మంది పోలీసు అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందించారు. మరింత మెరుగైన సేవలందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీలు విశ్వప్రసాద్‌, నాగేంద్రచారి, రవికుమార్‌, సీఐలు అనిల్‌కుమార్‌, ఉపేందర్‌, మొగిలి, వెంకటేశ్‌, బన్సీలాల్‌, కిరణ్‌, మధుకర్‌, సర్వర్‌, ఆర్‌ఐ కుమారస్వామి, రజనీకాంత్‌ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బోనం మొక్కులు



బోనాలతో వెళ్తున్న గిరిజన మహిళలు

రుద్రంగి(వేములవాడ): మండల కేంద్రం శివారులోని గువ్వల బండ తండా గిరిజన మహిళలు గురువారం బద్ది పోచమ్మకు బోనాలు సమర్పించారు. తండా మహిళలు నెత్తిన బోనాలతో వెళ్లి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న మహేశ్

వేములవాడఅర్బన్: గ్రామాలకు నిధులిచ్చింది కేంద్ర ప్రభుత్వమేనని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రం మహేశ్ అన్నారు. గురువారం వేములవాడ మండలం రుద్రవరం గ్రామంలో నిర్వహించిన ప్రజా గోస- బీజేపీ భరోసా కార్నర్ సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకుపోవాలన్నారు. ముంపు గ్రామాలకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం మరచిపోయిందని విమర్శించారు. రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడానికి ప్రతి ఒక్కరూ కష్టపడాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చింతపల్లి వెంకటేశ్వర్‌రావు, గాలిపెల్లి స్వామి, బుర్ర శేఖర్‌గౌడ్, అరుణ్, అనిల్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ నిందితులను ఉరితీయాలి

- టీఎస్‌టీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శర్మన్‌నాయక్



శర్మన్‌నాయక్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ర్యాగింగ్ పేరుతో కళాశాలల్లో పేద విద్యార్థులు అవమానాలకు గురవుతూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, ఇందుకు కారణమైన నిందితులను కఠినంగా శిక్షించాలని టీఎస్‌టీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శర్మన్‌నాయక్ డిమాండ్ చేశారు. గురువారం ఎల్లారెడ్డిపేటలో మాట్లాడారు. వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాలలో చదువుతున్న దరావత్ ప్రీతిని సైఫ్ అనే విద్యార్థితో పాటు మరికొంత మంది విద్యార్థులు కలిసి ర్యాగింగ్ చేశారన్నారు. ర్యాగింగ్‌పై ఈ నెల 20న ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోని కారణంగానే ప్రీతి ఆత్మహత్య చేసుకోవడం జరిగిందన్నారు. ఇందుకు కారణమైన సైఫ్‌ను ఉరితీయాలని డిమాండ్ చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలన్నారు. ఆడపిల్లల రక్షణకోసం ప్రత్యేక చట్టాలను అమలు చేయాలని కోరారు. ప్రీతి కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కథలాపూర్(జగిత్యాల): పెగ్గెర్ల గ్రామశివారులోని ఎస్సారెస్పీ వరదకాలువ సమీపంలో పేకాట శిబిరంపై కోరుట్ల సీఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు గురువారం సాయంత్రం దాడి చేశారు. 10 మంది పేకాటరాయుళ్లను పట్టుకున్నారు. వారినుంచి రూ.17,570 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా కొన్ని నెలలుగా కథలాపూర్, పెగ్గెర్ల గ్రామాల మధ్య ఎస్సారెస్పీ వరద కాలువ ప్రాంతంలో ఓ వ్యక్తి షెల్టర్ ఏర్పాటు చేసి ఇతర ప్రాంతాల వ్యక్తులతో పేకాట ఆడిస్తున్నట్లు జోరుగా చర్చించుకుంటున్నారు. ఇదే పేకాట శిబిరంపై ఇన్నాళ్లకు పోలీసులు దాడి చేసి పట్టుకోవడం విశేషం.

బతుకును అల్లుకున్నారు

> ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేటకు చెందిన నమిలికొండ లత. మహిళ సంఘం సభ్యురాలు. స్థానిక సీసీలు, వీవోల సూచనలతో అల్లికలు, ఫ్యాషన్ డిజైనింగ్‌పై శిక్షణ పొందింది. అధికారుల ప్రోత్సాహంతో 15 రోజుల వ్యవధిలోనే శిక్షణ పూర్తి చేసుకుంది. అప్పటి వరకు ఉపాధిహామీ పనులకు వెళ్లే లత శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత స్వయం ఉపాధితో ముందుకెళ్తున్నారు. ఇలా జిల్లాలోని 300 మంది మహిళలు అల్లికలు, కుట్లు, ఫ్యాషన్‌డిజైనింగ్‌లో శిక్షణ పొంది బతుకుపై భరోసాతో ఉన్నారు.



- అల్లికలు, కుట్టుశిక్షణతో స్వయం ఉపాధి
- ఆర్థికంగా స్థిరపడుతున్న మహిళలు
- ఐదు నెలల్లో 300 మందికి శిక్షణ
- బ్యాంక్ రుణాలు అందిస్తూ.. అండగా నిలుస్తున్న నాబార్డ్
- వ్యాపారులుగా నిలదొక్కుకుంటున్న అతివలు



అల్లికలు కుట్లపై శిక్షణ పొందుతున్న మహిళలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): వంటింటికే పరిమితమైన మహిళలు స్వయం ఉపాధి వైపు అడుగులు వేస్తున్నారు. కుట్లు, అల్లికలలో శిక్షణ పొందుతూ ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా నాబార్డ్ ఆధ్వర్యంలో ఐదు నెలల కాలంలో 300 మంది మహిళలకు మైక్రో ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్(ఎంఈడీపీ) కింద కుట్లు, అల్లికలలో శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు రుణ సౌకర్యం కల్పించి వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దుతున్నారు.

శిక్షణ ఇలా..

గ్రామాల్లోని గ్రామైక్య సంఘాల సీసీలు, సీఏలు ముందుగా గ్రూపులోని మహిళలకు శిక్షణపై అవగాహన కల్పిస్తారు. ఆసక్తి ఉన్న మహిళలను ఎంపిక చేసి 15 రోజులు జూట్‌బ్యాగ్స్, మగ్గం వర్క్, ఫ్యాషన్ డిజైనింగ్, అల్లికలు, ఎగ్జిబిషన్‌కు వినియోగించే ప్రత్యేకమైన వస్తువుల తయారీపై శిక్షణ ఇస్తారు. శిక్షణ కాలంలో ఒక్కొక్కరికి రోజుకు రూ.50 చొప్పున 15 రోజులకు రూ.750 ప్రోత్సాహక పారితోషికాన్ని అందజేస్తారు. శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లతోపాటు వారికి కావలసిన ముడి పదార్థాలు, ఉచిత భోజనం అందిస్తారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారు ఉపాధి పొందడానికి నాబార్డు అధికారులే బ్యాంకుల ద్వారా రుణాలు అందించి, స్వయంగా వ్యాపారాలు పెట్టుకునేలా ప్రోత్సహిస్తున్నారు. మహానగరాల్లో నిర్వహించే ఎగ్జిబిషన్‌లలో వీరు తయారు చేసిన ఫ్యాషన్ డిజైనింగ్ వస్తువులను విక్రయించుకునేలా అవగాహన కల్పిస్తున్నారు.

300 మందికి శిక్షణ

జిల్లా వ్యాప్తంగా ఐదు నెలల్లోనే 300 మందికి పలు అంశాల్లో శిక్షణ ఇచ్చారు. జిల్లాలోని తంగళ్లపల్లి మండల కేంద్రంలో 120 మంది శిక్షణ పొందగా, ఎల్లారెడ్డిపేట మండలంలోని మంత్రి కేటీఆర్ దత్తత గ్రామం రాజన్నపేటలో 90 మంది, సిరిసిల్ల మండలం ముష్టిపల్లిలో 30 మంది, సిరిసిల్లరూరల్ మండలం పెద్దూరులో 60 మంది శిక్షణ తీసుకున్నారు. శిక్షణ పూర్తయిన వారందరికీ నాబార్డ్ అధికారులే బ్యాంక్ రుణాలు అందించి వ్యాపారులుగా తీర్చిదిద్దారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి



నాబార్డు అధికారుల సహాయంతో కుట్లు, అల్లికలపై శిక్షణ పొందాం. మాకు ఉపాధి దొరకడంతోపాటు బయట ప్రపంచంతో సంబంధాలు ఏర్పడుతున్నాయి. అనేక రంగాల్లోని వ్యక్తులతో పరిచయాలు ఏర్పడి ఉపాధి అవకాశాలు మెరుగవుతున్నాయి.

– బీపేట లక్ష్మి, రాజన్నపేట

ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి..



మహిళలు ఆర్థికంగా ఎదిగి అభివృద్ధి చెందేలా ప్రోత్సహించడానికి కుట్టు శిక్షణ ఇచ్చాం. భవిష్యత్‌లో శిక్షణ పొందిన మహిళలకు బ్యాంక్ ద్వారా రుణాలు ఇప్పించి వారికి ఇష్టమైన రంగంలో దుకాణాలు పెట్టిస్తాం. మహిళలు తయారు చేసిన వస్తువులను నగరాల్లో జరిగే ఎగ్జిబిషన్‌లలో విక్రయించుకునేలా ప్రోత్సహిస్తాం. శిక్షణ కాలంలోనూ ప్రోత్సాక పారితోషికం అందిస్తున్నాం. రానున్న రోజుల్లో అన్ని గ్రామాలకు ఈ కార్యక్రమాన్ని విస్తరిస్తాం.

– పి.మనోహర్‌రెడ్డి, నాబార్డ్ ఏజీఎం

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల రెండో బైపాస్‌లో గురువారం సాయంత్రం రెండు బైకులు ఢీకొనగా, ఒకరికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాలు.. సిరిసిల్ల మున్సిపల్ పరిధి చిన్నబోనాలకు చెందిన గొసుకుల నర్సింగం టీవీఎస్ మోపెడ్‌పై పనినిమిత్తం సిరిసిల్లకు వచ్చాడు. తిరిగి వెళ్తున్న క్రమంలో బైపాస్ రోడ్డులో యూటర్న్ తీసుకుంటుండగా వెంకటాపూర్ నుంచి వస్తున్న ద్విచక్రవాహనదారుడు వెనక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో నర్సింగం తలకు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108 సమాచారం అందించి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

హెల్పరుకు విద్యుదాఘాతం

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): వేములకుర్తి గ్రామంలో ప్రైవేట్ హెల్పర్ గాంధారి శ్రీకాంత్ గురువారం విద్యుదాఘాతంతో గాయపడ్డాడు. స్తంభంపై మరమ్మతు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. స్తంభం పైనుంచి పడి గాయాలకు గురయ్యాడు. లైన్‌మెన్ రాజు వెంటనే స్పందించి మెట్‌పల్లి ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని మరో ఆస్పత్రికి తీసుకెళ్లారు. శ్రీకాంత్ ఆర్థిక పరిస్థితి అంతంతగానే ఉంది. దాతలు సాయం చేయాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. 97011 90413 నంబరుకు ఫోన్‌పే లేదా, గూగుల్ పే చేయాలని విన్నవిస్తున్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై కేసు

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లి గ్రామానికి చెందిన బక్కశెట్టి లక్ష్మీరాజంను ఢీకొట్టిన ఆర్టీసీ డ్రైవర్‌పై కేసునమోదు చేసినట్లు ఎస్సై అనిల్ గురువారం తెలిపారు. తాటిపల్లికి చెందిన బక్కశెట్టి లక్ష్మీరాజం గురువారం పని నిమిత్తం మేడిపల్లి గ్రామానికి వెళ్లి తాటిపల్లికి చేరుకుంటుండగా ఆర్టీసీ డ్రైవర్ అతివేగంగా వచ్చి లక్ష్మీరాజం ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో లక్ష్మీరాజంకు బలమైన గాయాలయ్యాయి. బాధితుడి కుమారుడు బక్కశెట్టి వెంకటేశ్ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

ఇటుకబట్టీలో పనిచేయలేం..

- మా ఇళ్లకు పంపించండి
- తహసీల్దార్, ఎస్సైకి వలస కూలీల మొర
- 11 మందిని పంపించిన అధికారులు



ఇటుకబట్టీలో విచారణ జరుపుతున్న తహసీల్దార్, ఎస్సై

పెద్దపల్లిరూరల్: పొట్ట కూటి కోసం ఇటుకబట్టీల్లో పనిచేసేందుకు వచ్చిన తాము ఇబ్బంది పడుతున్నామని, ఇక్కడ పనిచేయలేమని, తమను తమ ఇళ్లకు పంపించాలని తహసీల్దార్ వెంకటలక్ష్మి, బసంత్‌నగర్ ఎస్సై శ్రీనివాస్‌కు కొందరు వలస కూలీలు మొరపెట్టుకున్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సారంఘడ్ జిల్లా బార్‌పల్లి, రహనపల్లి గ్రామాల నుంచి వలస కూలీలు ఇక్కడకు వచ్చి పనిచేస్తున్నారు. అయితే ఇక్కడ పనిచేసే ప్రాంతాల్లో వారు ఇబ్బంది ఎదుర్కొంటున్నారని అక్కడి అధికారుల నుంచి జిల్లా ఉన్నతాధికారులకు సమాచారం అందింది. దీంతో గురువారం పెద్దపల్లి మండలం రంగాపూర్ గ్రామంలోని ఇటుక బట్టీలో విచారణ జరిపారు. విచారణ కోసం వచ్చిన అధికారుల ఎదుట తాము తమ ఊళ్లకు వెళ్తామని చెప్పడంతో బ్రింకడియా, మునితకడియా, దీపక్‌కడియా, సంతోషి కడియా, సీమాకడియా, చైతూ కడియా, సుగుణ కడియా తో పాటు వారి పిల్లలు కరణ్‌కడియా, లఖన్‌కడియా, ప్రీతం కడియా, దీపక్‌కడియాను అధికారులు ఇళ్లకు పంపించారు. వలస వచ్చిన కూలీలతో యజమానులు ఇష్టానుసారంగా పనిచేయించుకుంటున్నారని, సరైన ఆహారం అందించడం లేదని ఆదివాసీ సంఘం నాయకులు ఆరోపించారు. తాము సర్దార్ ద్వారా కూలీలకు అడ్వాన్స్ చెల్లించామని, పనిచేయకుండా వాటిని ఎగ్గొటేందుకే ఇలా చేస్తున్నారని, కూలీలతీరుతో తాము నష్టపోవాల్సి వస్తోందని బట్టీ యజమాని తెలిపారు.

జాప్యం వల్లే బదిలీలు, పదోన్నతులకు అవరోధం

- టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

సిరిసిల్లఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు బ్రేక్ రావడం చాలా శోచనీయమని, ఈ ప్రక్రియ విషయంలో జాప్యం చేయడం వల్ల అవరోధాలు అధికం అవుతున్నాయని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాతూరి మహేందర్‌రెడ్డి అన్నారు. స్థానిక శివనగర్‌పాఠశాలలో జిల్లా అధ్యక్షుడు దోర్నాల భూపాల్‌రెడ్డి అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం గురువారం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, జీఓ 317 విషయంలో ప్రభుత్వ చూపిన శ్రద్ధ ప్రస్తుత బదిలీలు, పదోన్నతుల విషయం చూపడం లేదని విమర్శించారు. ఒక వైపు ఆన్‌లైన్ పద్ధతిలో బదిలీలు, పదోన్నతులు చేపడితే పని సులభతరం అవుతుందని చెబుతూనే మరో వైపు షెడ్యూల్‌లో తీవ్ర జాప్యం చేసిన విధానాన్ని తప్పుబట్టారు. సామాజిక కోణంలో 317 జీఓ సమస్యలు ఎదుర్కొన్నవారికి న్యాయం చేయాలని ఉపాధ్యాయులు కోరినా వినని పాలకులు కోర్టు జోక్యం చేసుకోగానే అవకాశం ఇవ్వడం ఉపాధ్యాయులపై ఉన్న నిర్లక్ష్య వైఖరికి అద్దం పడుతుందన్నారు. సమస్యలను పరిష్కరించి ఉపాధ్యాయులు బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్‌నాథ్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్లు పూరెల్లి రవీందర్, జిల్లా ఉపాధ్యక్షులు మల్లారపు పురుషోత్తం, సత్తు రవీందర్, కార్యదర్శులు సూర భాస్కర్, తాళ్లపల్లి శ్రీధర్, హన్మండ్లు, రేగుల శ్రీనివాస్, బూస రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఆత్మహత్య

- ష్యూరిటీ పెట్టడంతో మనస్తాపం
- విషాదం నింపిన ఘటన



భాస్కర్(ఫైల్)

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వ ఉపాధ్యాయుడు పనాస భాస్కర్ (45) ఇతరుల చిట్టీలు, అప్పులకు ష్యూరిటీ ఇవ్వడమే ఆయన ప్రాణాలమీదికొచ్చింది. తీవ్ర మనస్తాపానికి గురైన ఆయన పట్టణ శివారులోని రైల్వే ఫ్లైఓవర్ వంతెన సమీపంలో గురువారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ కథనం ప్రకారం.. కాల్వశ్రీరాంపూర్ మండలం వెన్నంపల్లికి చెందిన భాస్కర్.. రామగిరి మండలం పన్నూర్ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. భార్య వాణి, ఇద్దరు పిల్లలతో యైటింక్లయిన్‌కాలనీ సమీపంలోని పోతనకాలనీలో నివాసముంటున్నారు. ఈ క్రమంలో భాస్కర్ కొందరికి ఫైనాన్స్ వ్యవహారాల్లో ష్యూరిటీ (జమానత్) గా ఉన్నారు. వారు కిస్తీలు సరిగా చెల్లించకపోవడంతో భాస్కర్ వేతనం నుంచి కోత పెడుతున్నారు. దీంతో భాస్కర్ కుటుంబానికి ఆర్థిక ఇబ్బందులు మొదలయ్యాయి. ఏం చేయాలో తెలియక కొంతకాలంగా మనస్తాపానికి గురవుతున్న భాస్కర్ ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని రైల్వేహెడ్‌కానిస్టేబుల్ పేర్కొన్నారు.

వెన్నంపల్లి, పోతనకాలనీలో విషాదం

కాల్వశ్రీరాంపూర్/యైటింక్లయిన్‌కాలనీ: భాస్కర్ పెద్దపల్లిలో రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్న సంఘటనతో వెన్నంపల్లిలో విషాదం నెలకొంది. భాస్కర్ తండ్రి పోశెట్టి ఏడాది క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. తల్లి లక్ష్మి ఇంటివద్ద ఒంటరిగానే ఉంటోంది. భాస్కర్ 15ఏళ్లుగా పోతనకాలనీలో నివాసం ఉంటున్నారు. ఆయన మృతిపై తోటి ఉపాధ్యాయులు సానుభూతి తెలిపారు. మృతదేహాన్ని వెన్నంపల్లికి తరలించారు.

విద్యుత్ షాక్‌తో కౌలు రైతు మృతి

జమ్మికుంట(హుజూరాబాద్): పొలం వద్ద ప్రమాదవశాత్తు కౌలు రైతు విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందాడు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు.. జమ్మికుంట మండలం గండ్రపల్లి గ్రామానికి చెందిన గోల్లేన శ్రీనివాస్(32) అదే గ్రామానికి చెందిన కచ్చ కొమురమ్మకు చెందిన ఎకరం పొలాన్ని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. ఈ క్రమంలో బుధవా రం మధ్యాహ్నం పొలం వద్దకు వెళ్లాడు. అర్ధరాత్రి వరకు కూడా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు వెతుకుతుండగా, పొలం వద్ద ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ గురై మృతిచెందినట్లు గుర్తించారు. మృతుడికి భార్య దీపిక, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు గురువా రం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు జ మ్మికుంట టౌన్ సీఐ రామచందర్‌రావు తెలిపారు.

గల్ఫ్ ఏజెంట్‌పై కేసు

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన బొద్దున శేఖర్‌తో పాటు తన ఇద్దరు స్నేహితులను కెనెడా పంపిస్తానని నమ్మించి మోసం చేసిన ఊబిది రాజుపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై అనిల్ గురువారం తెలిపారు. శేఖర్, అతడి స్నేహితులు మల్యాల మండలం లంబాడిపల్లికి చెందిన గల్ఫ్ ఏజెంట్ ఊబిది రాజును కెనడా పంపిస్తామని చెప్పడంతో నమ్మి పాస్‌పోర్టులు ఇచ్చారు. వారినుంచి రూ.50వేల చొప్పున ఏజెంట్ వసూలు చేశాడు. కెనడా పంపించకుండా మోసం చేయడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

యువకుడి బలవన్మరణం

కరీంనగర్‌క్రైం: ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కరీంనగర్ టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని మంకమ్మతోటకు చెందిన అవేజ్(19) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తూ అతడి తల్లితో ఉండేవాడు. అతడి బైక్‌పై లోన్ ఉండడంతో అది కట్టే పరిస్థితులు లేక తరచూ బాధపడుతుండేవాడు. ఆర్థికంగా ఇబ్బందులు ఉండడంతో తన తల్లితో బుధవారం రాత్రి డబ్బుల గురించి గొడవ జరిగింది. దీంతో అవేజ్ తల్లి తన కూతురు ఇంటికి వెళ్లింది. ఈక్రమంలో మనస్తాపానికి గురైన అవేజ్ గురువారం వేకువజామున ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.


నలుగురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లిలో గురువారం పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న నలుగురిపై కేసులు నమోదు చేశారు. ఈసందర్భంగా ఎస్సై శేఖర్ మాట్లాడుతూ, ప్రతీ వాహనదారు రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకు వెళ్లడం ఖాయమన్నారు.

నిధులు గోల్‌మాల్ !



నర్సింగపూర్ ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో బోరుకు కనిపించని మోటారు



నిధులు మంజూరు చేసి , పనులు పూర్తి చేసినట్లు తెలుపుతున్న ప్రగతి నివేదిక

- మూతపడ్డ స్కూల్‌కు అదనపు బిల్డింగ్, బోరు, మోటారు మంజూరు
- 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి కేటాయింపు
- రూ.1.20 లక్షలు స్వాహా
- చూసీచూడనట్లుగా ఉన్న అధికారులు

చందుర్తి(వేములవాడ): అధికారంలో ఉంటే ఏదైనా చేయవచ్చనే ధీమా కావచ్చు.. అడ్డగోలు అక్రమాలకు తెరలేపారు. మూతపడ్డ పాఠశాలకు నిధులు కేటాయించి.. వాటిని స్వాహా చేసిన విషయం ఆలస్యంగా తెలిసింది. చందుర్తి మండలం నర్సింగపూర్ ఎస్సీ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను 2017–18 విద్యా సంవత్సరంలో విద్యార్థులు లేరని మూసివేశారు. 2022–23 విద్యా సంవత్సరంలో తిరిగి తెరిచామని విద్యాశాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. అయితే మూతపడ్డ పాఠశాలకు 2020–21 ఆర్థిక సంవత్సరంలో 15వ ఆర్థికసంఘం నిధుల నుంచి రూ.1.20 లక్షలు మంజూరు చేశారు. తిరిగి 2021–22లో అదనపు బిల్డింగ్ పేరిట రూ.3లక్షలు కేటాయించారు. మూతపడ్డ పాఠశాలకు నిధులు ఎందుకు కేటాయించారనేదానిపై అనుమానాలు కలుగుతున్నాయి.

బోరుకు రూ.1.20లక్షలు ఖర్చు

మూతపడ్డ పాఠశాలలో బోరు కోసం రూ.1.20లక్షలు కేటాయించారు. బోర్ వేసినందుకు రూ.79,117 ఖర్చు చేశారు. బోర్ వేసినప్పటికీ మోటార్ బిగించలేదు. దీనిపై గ్రామస్తులు ప్రశ్నిస్తే బోర్ వేసే సమయంలోనే కూలిపోయిందనే సమాధానాలు పాలకవర్గం నుంచి వచ్చాయి. జనవరి 24న జరిగిన సర్వసభ్య సమావేశంలో ప్రగతి నివేదికలో ఎస్సీకాలనీ ప్రాథమిక పాఠశాలలో బోరు, మోటారుకు రూ.1.20 లక్షలు ఖర్చు చేసినట్లు నివేదికలో పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు కుమ్మక్కయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నర్సింగాపూర్‌లో సర్పంచ్, ఎంపీటీసీలు ఇద్దరు ఒకే పార్టీ వారు. అయితే ఇద్దరి మధ్య సఖ్యత లేక పరస్పర విమర్శలు చేసుకుంటుండడంతో అక్రమాలు వెలుగుచూస్తున్నాయి.

ఈవిద్యా సంవత్సరమే తెరిచాం



నర్సింగపూర్ ఎస్సీ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను విద్యార్థులు రావడం లేదని 2017లో మూసివేశారు. అప్పటి నుంచి మూతపడి ఉంది. 2022–23 విద్యాసంవత్సరంలో పాఠశాలను తిరిగి తెరిచాం. ప్రస్తుతం 25 మంది విద్యార్థులు ఉన్నారు.

– శ్రీనివాస్ దీక్షితులు , ఇన్‌చార్జి ఎంఈవో, చందుర్తి

సభ్యుల తీర్మానంతోనే కేటాయించాం



మండల పరిషత్ నిధులను సభ్యుల తీర్మానంతో కేటాయించాం. నర్సింగపూర్ ఎస్సీకాలనీలో ప్రాథమిక పాఠశాలకు అదనపు భవనానికి, బోరు మోటారుకు నిధులను కేటాయించింది వాస్తవమే. కానీ పాఠశాల ఆవరణలో బోరు వేస్తే కూలిపోయింది. మండల సర్వసభ్య సమావేశం ప్రగతి నివేదికలో బోరు, మోటారుకు రూ.1.20లక్షలతో పనులు పూర్తి చేశామని తప్పిదంగా నమోదైంది.

– పత్తి రవీందర్, ఎంపీడీవో, చందుర్తి